నవతెలంగాణ

1

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

నవదంపతుల ఆత్మహత్య

వివరాలు మెయిన్‌లో..



- తమపై దుష్ప్రచారం చేస్తుండటంతో
- సూసైడ్ చేసుకుంటున్నట్లు వాట్సప్‌లో స్టేటస్
- ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించిన పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

'ఏడాది క్రితం ఓ తప్పు చేశా. నా తప్పును భర్తతో పాటు అత్తమామలు అంగీకరించి ఏమీ అనలేదు. అయితే మా పిన్ని మాపై దుష్ప్రచారం చేస్తుంది. అందరికీ చెప్తుండటంతో మేము బయట మొహం చూపించలేక పోతున్నాం. ఆ వేధింపులు తాళలేక రెండు వారాల క్రితం నా భర్త కూడా పురుగుల మందు తాగిండు. అయినా మా పిన్ని దుష్ప్రచారం ఆపలేదు. మా చావుకు కారణం మా పిన్నే' అంటూ నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన బండారి శైలజ(22), బండారి అనిల్ కుమార్(25) నవ దంపతులు సూసైడ్ వీడియో తీసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని మిట్టపూర్ రైల్వే గేటు సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవిందుపేట్‌లో కరెంటు సమస్యలు లైన్మెన్ లేని కారణంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సుప్రరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించి గ్రామా సబ్‌స్టేషన్‌కు వచ్చి ఈడిఏఈ సమక్షంలో గ్రామ సమస్యలు స్వయంగా తెలుసుకొని పరిష్కరించే విధంగా అధికారులకు సూచనలు చేశారు. తక్షణమే ఇన్‌చార్జి లైన్మెన్ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ బంటు మహిపాల్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రొక్కం సాయిరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ యాళ్ల రమేష్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ఫిర్యాదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

పంచాయతీల్లో పైసల్లేవ్

- ట్రాక్టర్‌లో డీజిల్ పోసేందుకు సైతం తిప్పలు
- బ్లీచింగ్ పౌడర్ వీధిలైట్ల కొనుగోలుకు ఉద్దేర ఖాతాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక తిప్పలు



బురదమయంగా మారి నీటిమడులను తలపిస్తున్న రోడ్డు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిధులు లేక పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. రోజు వారి పనులు నిర్వహించేందుకు సైతం తిప్పలు తప్పడం లేదు. దాదాపు ఆరు నెలల నుంచి ఒక్కరూపాయి సైతం నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలు నెలకొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో నిధుల కటకట నెలకొంది.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలంటారు. ప్రగతి బాటలో పయనించాల్సిన పల్లెలు నిధులు రాక వెనుకబడి పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు కొన్ని నెలలుగా ఆగిపోవడంతో నిధుల కటకటను ఎదుర్కొంటున్నాయి. ఒకటి రెండు నెలలు పైసలు రాకపోతే ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్న ఈ రోజుల్లో ఏకంగా ఆరు నెలలుగా నిధులు పత్తా లేకుండా పోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతినెల రావాల్సిన 15 వ ఆర్థిక సంఘం నిధులు గత ఆరు నెలల నుంచి జాడ లేకుండా పోగా రాష్ట్ర ప్రభుత్వం అందించే స్టేట్ ఫైనాన్స్ నిధులు సైతం గత రెండేళ్ల నుంచి రావడం లేదు. దీంతో పల్లెల పరిస్థితి దారుణంగా మారింది.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 525 గ్రామపంచాయతీలున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోజువారిగా బ్లీచింగ్ పౌడర్, లైమ్‌తో పాటు స్ట్రీట్ లైట్లు, దోమల నివారణకు ఉపయోగించే బయోలార్వ మందుల కొనుగోలుకు కూడా డబ్బులు లేని పరిస్థితి గ్రామాలలో నెలకొంది. వీటిని పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఏజెన్సీ నుంచి ఉద్దెరగా తీసుకొస్తున్నారు. మరో పక్క ప్రతినెల 60 వేల వరకు కరెంట్ బిల్లు వస్తుండడంతో ఈ బిల్లు చెల్లించేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తోంది అని కార్యదర్శులు వాపోతున్నారు. చిన్న పని తలపెట్టాలన్నా చేతిలో చిల్లిగవ్వ లేకుండ పోయిందని పల్లెలో రోజువారి పనులు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులు ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గ్రామానికి కావలసిన సామాన్లను అప్పు రూపంలో తీసుకు వస్తున్నామని మరికొన్నింటిని మా సొంత డబ్బులతో కొనుగోలు చేసి తీసుకొస్తున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. ప్రత్యేక అధికారులు ఉన్నా ఆర్థికంగా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయినట్టు సమాచారం.

కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేసిన డబ్బులతో వాటిని గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసి దాని నుండి సిబ్బందికి జీతాలు చెల్లించడానికి ఉపయోగిస్తున్నారు. దానితోపాటు వీధి బల్బులు మండల కేంద్రంలోని షాపుల నుండి ఉద్దెర తీసుకొచ్చి వాటిని ఫండ్ వచ్చిన తర్వాత చెల్లిస్తున్నారు. శానిటైజేషన్ సంబంధించి ఏది కావాలన్నా కొన్ని షాపుల నుండి మరికొన్ని తమ జీతంలో నుండి తీసుకొచ్చి బిల్లులు జమ చేస్తున్నట్టు కార్యదర్శులు వాపోతున్నారు.

గత రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి పేరిట గ్రామాలలో వివిధ కార్యక్రమాలు చేపట్టింది. ప్రతినెలా నిధులు విడుదల చేస్తూ రోడ్లు బాగు చేయడం, ఇంటిట చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ లు, స్మశానవాటికలు తదితర వాటి నిర్మించడమే కాకుండా రోజువారిగా కార్యకలాపాలు చేపట్టేలా పారిశుద్ధ కార్మికులను నియమించింది. ఇందుకు సంబంధించి ప్రతి నెల నిధులు విడుదల చేసేది. కేంద్రం నుంచి సైతం 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో వచ్చేవి దీంతో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ఆస్కారం ఏర్పడింది. కానీ గత ఆరు నెలలుగా రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఏర్పడటం తొలుత అసెంబ్లీ ఎన్నికలు రావడం తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడం వలన అభివద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో పల్లెలలో నిధులు లేమీ సమస్య ఏర్పడింది. ఎన్నికల ప్రక్రియ ముగిసిపోయినా నిధులు మాత్రం విడుదల కావడం లేదు. ఇప్పుడైనా పల్లెలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి పల్లెల అభివద్ధికి ప్రభుత్వం కషి చేయాలని గ్రామాలలోని ప్రజలు కోరుకుంటున్నారు.



ర్యాలీ చేపడుతున్న కార్మికులు, నాయకులు

ప్రాణాలు పణంగాపెట్టి

పని చేస్తుంటే వేతనాలు ఇవ్వరా..?

- లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు పెండింగ్ వేతనం చెల్లించాలి
- లిఫ్ట్ ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పట్ల ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యాన్ని వీడి సమస్యలు పరిష్కరించాలని లిఫ్ట్ ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్‌ల వద్ద పనిచేసే కార్మికులకు గత ఐదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులకు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలకుపైగా గుత్ప, అలీసాగర్ పరిధిలోని వివిధ పంప్‌హౌస్‌ల వద్ద పనిచేసే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని, పంప్‌హౌస్లలో విష సర్పాలు, తేళ్ల క్రిమి కీటకాలతో రోజు దినదిన గండంగా పనిచేస్తున్నారని తెలియజేశారు. అటువంటి కార్మికులకు నెలనెలా వేతనాలు ఇవ్వకుండా, సంవత్సరం నుంచి పీఎఫ్ డబ్బులను జమ చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు తమకు సంబంధం లేదన్నట్టుగా అధికారులు మాట్లాడటం సరైనది కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే జోక్యం చేసుకొని బకాయి వేతనాలను పీఎఫ్ డబ్బులను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అనేకమార్లు వినతి పత్రాలు అందజేసినట్టు గుర్తుచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గణేష్, మహిపాల్, కార్తీక్, సీతారాం నాయక్, బుచ్చన్న, అజయ్, నరేష్, రవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల నియామక నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-బాన్సువాడ

కామారెడ్డి జిల్లా బాన్సువాడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని చౌకధరల దుకాణం (రేషన్) డీలర్ల ఖాళీల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్టు బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రెస్ నోట్ విడుదల చేశారు. డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బిచ్కుంద, బిర్కూర్, నసురుల్లాబాద్, మద్నూర్, మహమ్మద్ నగర్, పెద్ద కొడపల్, జుక్కల్, నిజాంసాగర్, డోంగ్లి మండలాల్లో ఖాళీగా ఉన్న 28 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టుతెలిపారు.

అర్హత..

పదవ తరగతి (యస్.యస్.సి) పాసై ఉండాలి. దరఖాస్తు దారులు 18-40 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండవలెను. దరఖాస్తు దారుల పై ఎలాంటి సివిల్/క్రిమినల్ కేసులు ఉండి ఉండరాదు. గ్రామవాసియై ఉండాలి. రెవిన్యూ పౌరసరఫరా శాఖలో పని చేయు వారికీ దగ్గరి బంధువు అయి ఉండరాదు. చౌకధరల దుకాణం డీలర్ గా నియమించబడిన వ్యక్తి ఒకవేళ ఏదైనా ఒక గ్రామ పంచాయతీకి గాని మునిసిపాలిటికి కాని ఇతర ప్రజా సంబందమైన సంస్థలకు కాని ఎన్నిక అయినట్టు ఐతే వారిని డీలర్ గా తొలగించుటకు సమ్మతి పత్రం రాసి ఇయ్యవలెను.

డీలర్ గా నియమించిన వ్యక్తి తప్పకుండ 5 సంవత్సరములు పని చేయుటకు సిద్ధం అయి ఉండవలెను. లేనిచో వారు కట్టిన దరావత్ జప్తు చేయబడును. అభ్యర్థులు తగినంత ఆర్థిక స్తోమత కలిగి ఉండవలెను. దరఖాస్తు దారులు వారు

మండలం	గ్రామం	రిజర్వేషన్
బాన్సువాడ	తాడ్కోల్	ఓసీ జనరల్
బిచ్కుంద	గుండెనెమలి	బీసీ జనరల్
	పెద్దదడ్గి	ఎస్సి జనరల్
	బిచ్కుంద-3	బీసీ మహిళా
	గుండెకల్లూర్	ఎస్సి జనరల్
	బిచ్కుంద-5	ఎస్టి మహిళా
బీర్కూర్	బీర్కూర్	ఎస్సీ జనరల్
బిర్కూర్	బీర్కూర్-2	ఎస్టీ మహిళ
	కిస్టాపూర్	వికలాంగులు(జ)
డోంగ్లి	డోంగ్లి	బీసీ మహిళ
జుక్కల్	క్షేమాజ్‌కల్లాలి	ఎస్సి మహిళ
మద్నూర్	హండె కేలుర్	ఓసి జనరల్
	మద్నూర్-2	ఓసి జనరల్
	మద్నూర్-4	ఓసి మహిళ
	మద్నూర్-5	ఎస్సి జనరల్
	శేకాపూర్	ఎస్సి జనరల్
మహమ్మద్‌నగర్	తున్కిపల్లి	ఎస్సి జనరల్
నసురుల్లాబాద్	దుర్కి	బీసీ జనరల్
	బస్వాయిపల్లి	బీసీ జనరల్
	నసురుల్లాబాద్	ఓసీ మహిళ
	దుర్కి	ఎస్సి జనరల్
	అంకోల్	ఎస్సి జనరల్
	బొమ్మన్‌దేవపల్లి	బీసీ జనరల్
నిజాంసాగర్	వెల్గనూర్	బీసీ జనరల్
	బంజపల్లి	ఓసి జనరల్
	జక్కాపూర్	అంగవైకల్యం(జ)
పెద్దకొడప్‌గల్	పోచారం	ఎస్టీ జనరల్
	కస్లాబాద్	బీసీ జనరల్

చౌకధరల దుకాణమునకు దరఖాస్తు చేయుచున్నారో కచ్చితంగా రాయాలి. రిజర్వేషన్ వారికీ కేటాయించిన దుకాణములకు ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తుని చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు కావలెను

- బదిలీల తర్వాత టీచర్‌ల కొరత
- ఇంకా సర్దుబాటు చేయని విద్యాశాఖ
- నష్టపోతున్న విద్యార్థులు



నవతెలంగాణ-జుక్కల్

మండలంలో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. ఇటీవల బదిలీలు చేపట్టగా.. పలువురు మండలం నుంచి బదిలీపై వెళ్లారు. కాగా వారి స్థానంలో వేరే ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. జుక్కల్ మండలంలో మొత్తం 45 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జుక్కల్ కేంద్రంలో ఉర్దూ మీడియంతో కలిపి 2, కౌలాస్ 1, ఖండేభల్లూర్ 1, పెద్దఎడ్గి 1, హంగర్గ 1, జిల్లా పరిషత్ పాఠశాలలు కాగా 27 ఎంపీపీఎస్, 12 ఎపీయూపీఎస్, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్నాయి. ఈ పాఠశాలలో మొత్తం 157 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు.

మండలంలో మొత్తం 157 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తుండగా.. 39 మందికి బదిలీకి అవకాశం కలిగింది. అందులో 28 మంది బయటి మండలాలకు రిలీవ్ అయి వెళ్లిపోయారు. మరో 11 మంది ఉపాధ్యాయులు లోకల్ స్థానిక మండలంలోని వివిధ పాఠశాలలకు బదిలీ చేసుకున్నారు. ఇక మిగిలింది 129 మంది ఉపాధ్యాయులే.

మండలంలోని పలు పాఠశాలకు సింగల్ టీచర్లు ఉన్నారు. అటువంటి పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీని ఎఫెక్ట్ విద్యార్థుల బోధనపై పడి సిలబస్ పూర్తి కాక పరీక్షల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని విద్యార్థుళ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కలెక్టర్, విద్యాశాఖాధికారులు స్పందించి బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలోని ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్దుబాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. మండలంలోని విద్యా వమరుల కేంద్రంలో అధి కారులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఎస్ఎఫ్ఐ జుక్కల్ మండల అధ్యక్షులు షైక్ ఫిర్దోస్ మాట్లాడుతూ జుక్కల్ మండలంలోని అన్ని జడ్పీహెచ్ఎస్ పాఠ శాలలో ఉపాధ్యాయుల మార్పిడిలో భాగంగా జుక్కల్ మండలంలోని జుక్కల్, (ఇంగ్లీష్-4, గణి తం-1, భౌతిక శాస్త్రం -1, జీవశాస్త్రం-1, హిందీ-1, సాంఘిక శాస్త్రం -2) పెద్దఎడ్గి (తెలుగు -1, ఇంగ్లీష్-1, భౌతిక శాస్త్రం-1, సాంఘిక శాస్త్రం-1, పీడీ-1) , హంగార్గ (గణితం-1, ఇంగ్లీష్-1, తెలుగు -1) కౌలాస్ (ఇంగ్లీష్ -1) ఖండేబాల్లూర్ (గణితం -1, భౌతిక శాస్త్రం -1)గాల గ్రామం లో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయలు లేక అనేక ఇబ్బందులపాలు పడుతున్నట్టు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయుల బదిలీల పేరుతో తరగతు లు నిర్వహించడం లేదని, మళ్ళీ తిరిగి రావాల్సిన ఉపాధ్యాయలు ఇప్పటి వరకు రాలేదని, దీంతో విద్యార్థులు పాఠాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ఉపాధ్యాయలను తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జుక్కల్ మండల నాయకులు సాగర్, జెమిల్, విలాస్ పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రయోజనకరంగా ఉండాలి

- కొర్రీలు సవరించి జీవో జారీ చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులకు రుణమాఫీకి ప్రయోజనకరంగా సవరించాల మీ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిమూడ్ శోభన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.567 తేది. 15. ప్రకారం రైతుల రుణమాఫీకి రూపొందించిన నిబంధనలలో గల అంశాలను సవరించి 2 లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధికలుగునట్లు సవరించాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

'ప్రభుత్వ జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకేకుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన కుటుంబంతో విడిపడినవారికి రుణమాఫీ వర్తించదు. ఆదార్‌కార్డు, పాస్‌బుక్ డేటా, పిడిఎస్(రేషన్‌కార్డు డేటా) ఒకటిగా ఉన్న వారికే వర్తింపచేశారు. ఆదార్‌కార్డు లేని వారు, పాస్‌బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. పాసు పుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ప్రజాపాలన సర్వేలో తేలింది. అలాగే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు ఉన్న వారికే వర్తింపజేశారు. వ్యవసాయం కోసం రుణం తీసుకున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్ (స్వయం సహాయక బందాలు) జాయింట్ లయబిలిటీ గ్రూప్, రైతు మిత్ర గ్రూప్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజబిలిటీ కార్డు ఉన్న వారికి రుణ మాఫీ వర్తించదని ప్రకటించారు. వాస్తవానికి ఈ నాలుగు గ్రూపుల్లోని వారు అత్యంత పేదలే కాక దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల్లో ఉండి వచ్చిన వారే ఎక్కువ. రీ షెడ్యూల్డ్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించదని నిబంధన చెబుతున్నది. గతంలో కరువులు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణారు 3 నుంచి 5 సంవత్సరాల వాయిదాలపై రీ షెడ్యూల్ చేశారు. వీరికి రుణమాఫీ వర్తించదు. రెండు లక్షలకు మించి రుణం పొందిన వారు, రెండు లక్షలకు పైన ఉన్న అప్పు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని నిబంధన పెట్టారు. గత 10 సంవత్సరాలుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వల్ల అసలుకు మించి వడ్డీలు పెరిగాయి. చాలామంది రైతులు రెండు లక్షలకు పైగా బాకీలు ఉన్నప్పటికీ గతంలో ప్రకటించిన 2014, 2018 రుణమాఫీ పథకాలు వారికి వర్తించలేదు. అట్టి వారికి రుణం రెండు లక్షలకు పైగా ఉంది. వారు అప్పు చెల్లించగలిగిన స్థితిలో లేరు. ప్రస్తుతం వానాకాలం పంటలు వేయడం ప్రారంభించడంతో రైతుల పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నారు. జూన్-సెప్టెంబర్ మధ్య రెండు లక్షలకు పైగా ఉన్న అప్పు చెల్లించడం సాధ్యం కాదు. పిఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడిరచడం వలన చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయి. పిఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికే వర్తింపజేశారు. అందువలన పిఎసం కిసాన్ డేటాను వర్తింపజేయడం వలన అర్హత కలిగిన వారు రుణమాఫీ పొందలేకపోతారు. 12.12.2018 నుండి 9.12.2023 వరకు ప్రకటించిన రుణమాఫీని వర్తింపజేయడానికి కొన్ని బ్యాంకులు జనవరి 2024 నుండి రుణాలను కొత్త రుణాలుగా రీ షెడ్యూల్ చేశాయి. గతం నుండి బ్యాంకులు "బుక్ అడ్జెస్ట్‌మెంట్" ద్వారా రైతులకు రుణాలు పెంచుకుంటూ వస్తున్నాయి. అందువల్ల 9.12.2023 తర్వాత రీ షెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేస్తున్నది. ఇందుకు అనుగుణంగా జీవోను సవరించాలని' డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, భూమన్న, ,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్

జూనియర్ కాలేజీలో

అదనపు గదులు నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫస్టియర్ విద్యార్థులకు స్వాగత సభ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత సభను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూదాం అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తరగతి గదులు సరిపడా లేవని వెంటనే అదనపు గదులను నిర్మించాలని అన్నారు. కళాశాలలో సుమారు 500 మంది కి పైగా విద్యార్థులు ఉంటే కనీసం 10 తరగతి గదులు కూడా లేవని, ఇంటర్మీడియట్ రెగ్యులర్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు కామారెడ్డి జూనియర్ కళాశాలలో ఉండడం వల్ల విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడం సరైనది కాదని గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా కూడా సమస్య పరిష్కారం చేయలేదన్నారు. ప్రస్తుతం ఈ కొత్త ప్రభుత్వమైన వెంటనే గదుల నిర్మాణం చేపట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ మణికంఠ, నాయకులు రాహుల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య ఉద్యోగాలు అందించి ఆదుకోవాలి

నవతెలంగాణ-ధర్పల్లి

గత 11 నెలలుగా 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏలు వేచి చూస్తున్న కారుణ్య ఉద్యోగాలను కల్పించాలని వీఆర్ఏల డివిజన్ అధ్యక్షుడు చెలిమేల రాములు ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రవీణ్, జలంధర్, సుధీర్, రాజు, గణేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేసిన పలువురు

ఉపాధ్యాయురాలి సర్దుబాటు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని దుబ్బా ప్రాంతంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడి స్థానంలో మరో ఉపాధ్యాయురాలిని అధికారులు సర్దుబాటు చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై నవతెలంగాణ దినపత్రికలో ఈనెల 13వ "ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు" అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తక్కువ విద్యార్థులున్న చోట నుంచి ఎక్కువ విదార్థులున్న ఈ పాఠశాలకు ఉపాధ్యాయురాలిని సర్దుబాటు చేశారు.



ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు

నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్ర ఆగ్రో చైర్మన్‌ను సన్మానించిన నాయకులు



ఆగ్రో ఇండస్ట్రీ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కాసుల బాలరాజును చందూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ ప్యారం ఆశోక్ యాదవ్, లక్ష్మపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రాంరెడ్డి, పుల్లయ్య, బి.సాయిలు తదితరులున్నారు.

సాధారణ గ్రామసభ నిర్వహణ



మాట్లాడుతున్న గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్

నవతెలంగాణ-బాల్కొండ

గ్రామంలో రెండు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ గ్రామసభను బాల్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ గ్రామంలో గత రెండు నెలల నుంచి జరిగిన పనులపై పలు అంశాలు ఈ సభలో చదివి వినిపించారు. ఈ గ్రామసభలో గ్రామ సదర్ సల్ల నరసయ్య గ్రామంలో పలు సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరుతూ అందులో బాల్కొండ ఏబీనగర్ పెద్ద పోచమ్మ వద్ద డ్రైనేజీ సమస్య, ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, మండల కేంద్రంలో బస్‌స్టాప్‌ల వద్ద బస్సు షెల్టర్లను నిర్మించాలని తదితర సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు గ్రామంలో ప్రబలకుండా గ్రామస్తులు తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏపీవో ఇందిరా, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోటగల్లి పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కోటగల్లి ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ విద్యశాఖలో వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ.. కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున మధ్యాహ్న భోజనం ఏజెన్సీని రద్దు చేయాలని ఆమె కోరారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకొని వెంటనే ఏజెన్సీని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

317 బాధితులను సొంత జిల్లాలకు కేటాయించాలి

- 317 ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ జేఏసి



మాట్లాడుతున్న దత్తాద్రి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రవ్యాప్తంగా 317 జీవో బాధితుల సమస్యలను పరిష్కరించి వారిని సొంత జిల్లాలకు కేటాయించాలని 317 ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ జేఏసి డిమాండ్ చేసింది. మంగళవారం 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 317 ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ జేఏసీ కన్వీనర్ కట్ట దత్తాద్రి మాట్లాడుతూ.. సబ్ కమిటీలో వచ్చిన అప్పీల్స్‌ను అన్ని శాఖల అధికారులచే తగు పరిశీలన చేసి వాస్తవ బాధితులను గుర్తించి వారందరినీ వీలైనంత తొందరగా సొంత జిల్లాలకు కేటాయింపు చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. త్రీ వన్ సెవెన్ బాధితులలో చాలామంది మూడు నుంచి నాలుగుసార్లు హెూటల్లో అప్లై చేసుకున్నారని, కాబట్టి వాటన్నింటిని కన్సల్ డేట్ చేస్తే కేవలం 5000 నుంచి 6000 లోపు మాత్రమే బాధితులు స్థానికత ఆధారంగా కేటాయింపులు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

అర్హులకే రైతు భరోసా

- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం
- ప్రభుత్వం పడిపోవాలని బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకే రైతు భరోసా అందిస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం లహరి ఇంటర్నేషనల్ హోటల్ వద్ద గల రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ ఇచ్చాడు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుంది. ఈ చరిత్ర కాంగ్రెస్ పార్టీదే. ఆరు గ్యారెంటీలలో ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నెరవేర్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మహిళలే కాదు.. ఎందరో పేద విద్యార్థుల ఆడపిల్లలు కూడా ఉచితంగా బస్సులో ప్రయాణించి ఉన్నత చదువులను కొనసాగిస్తున్నారు. గతంలో ఆర్టీసీ నష్టాల్లో ఉండేది. ఇప్పుడు ఆర్టీసీ నష్టాల్లో లేదు. లాభాల్లో ఉంది. ఆక్యుపెన్సీ పెరిగింది. ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులను చెల్లిస్తుంది. గృహ జ్యోతి పథకం కింద ప్రతి పేద ఇంటికి 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందుతుంది. అక్కడక్కడ పలు సమస్యలున్నా.. త్వరలో పరిష్కరించి లబ్ధిదారులందరికీ 200 యూనిట్ల వరకు విద్యుతును ఉచితంగా అందేలా కృషిచేస్తున్నాం. గత పది సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం విడుతల వారిగా మాఫీ చేసింది తప్ప ఒక్కసారిగా రుణమాఫీ చేయలేదు.' అని తెలిపారు. 10 సంవత్సరాల పాలనలో బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి? మీరు పాలిస్తున్న సుమారు 13, 14 రాష్ట్రాలలో ఎక్కడైనా రైతుబంధు, రుణ మాఫీ అమలు చేశారా?, ఉద్యోగాలు ఎక్కడైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్, హరీష్‌రావు సెంట్రల్‌లో మోడీ కాళ్ల మొక్కి రాజ్యసభ సీట్లు బిజెపిలో కల్పిస్తానని చెప్పి కవితను విడిపించేందుకు అక్రమాలకు అవినీతికి పాల్పడు తున్నారని విమర్శించారు. కెసిఆర్, హరీష్‌రావు తలకిం దులు చేసిన మీ పార్టీ నిలబడే పరిస్థితి లేదని తెలిపారు. కుటుంబ పాలన, గడీల పాలన గడిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాల మరమ్మతుల కోసం రూ.1200 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసిందని, పాఠశాలలో మరమ్మతులు, ఇతర సౌకర్యాలు కల్పించామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

దోమల నివారణకు ఆయిల్ బాల్స్ విడుదల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమల నివారణ కోసం ఆయిల్‌బాల్స్ వదిలినట్లు పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో ఇందుకోసం అవసరమైన ఆయిల్‌బాల్స్ తయారు చేయించినట్లు తెలిపారు. మంగళవారం ఆ ఆయిల్ బాల్స్‌ను మురుగునీటి కుంటల్లో, వర్షపు నీరు చేరే ప్రదేశాల్లో పంచాయతీ సిబ్బందితో వేయించినట్లు తెలిపారు. ఆయిల్ బాల్స్‌ను వదలడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమల లార్వ చనిపోతుందన్నారు. ఆయా ప్రదేశాల్లో పదుల సంఖ్యలో ఆయిల్ బాల్స్‌ను వదిలినట్లు ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపిన ఆయన ఇప్పటికే పలుమార్లు గ్రామంలో ఫాగింగ్ చేయించినట్లు వివరించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, చెత్తాచెదారం మురికి కాల్వలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చునని అన్నారు.



ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో మంగళవారం అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మ మాట.. అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అంగన్వాడి ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాల ప్రాముఖ్యత, పౌష్టికాహారంపై చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడి కేంద్రాల పరిధిలోని తల్లులకు, అంగన్వాడి బడి ఈడు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేయించాలని కోరారు. ప్రీ స్కూల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తమ చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేసి వారి ఆరోగ్యానికి, సంతోషానికి అవకాశం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులను నమోదు చేయించడం ద్వారా వారి భవితకు పునాది వేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ, సరిత, ఆయాలు లక్ష్మీ, శారద, ఏఎన్ఎం అరుణ కుమారి, ఆశా కార్యకర్తలు, సిఏలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు

గౌడ కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- బోధన్ అబ్కారీశాఖ సీఐ పవన్‌గౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి

గౌడ కులస్తులు, గీతకార్మికులు ఆర్థికంగా ఎదగాలని బోధన్ ఆబ్కారీ శాఖ సిఐ పవన్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామ శివారులోని వైకుంఠధామం, శ్మశానవాటిక పరిధిలో అక్బర్‌శాఖ ఎక్సైజ్ పోలీస్ అధికారులు, వన ఉత్సవంలో భాగంగా ఖర్జూర, తాటి మొక్కలను నాటారు. గీత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బాగుపడాలంటే ఈత వనాలను, తాడి చెట్లను కాపాడుకొని చెట్ల ద్వారా వచ్చిన కల్లును విక్రయించుకొని తమ కుటుంబాలు బాగుపడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన కల్లును విక్రయిస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆయన గుర్తు చేశారు. అనంతరం ఎక్సైజ్, ఆబ్కారీ శాఖ పోలీస్ అధికారులు, స్థానిక చెరువు గట్టుపై నాటిన ఖర్జూర, తాటి మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు పట్ల పోలీస్ అధికారులతో పాటు స్థానిక గౌడ పెద్దలు బండ మనోహర్‌ను అభినందించారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ బండ మనోహర్, హరితహారం, నర్సరీ కేంద్రా లలో నాటిన మొక్కలను సంరక్షించ డమే కాకుండా నర్సరీ కేంద్రం నుంచి రకరకాల పూల మొక్కలతో పాటు పం డ మొక్కలను గ్రామ పంచాయతీ కార్య దర్శి రామిరెడ్డి సమక్షంలో గ్రామ స్తులకు పంపిణీ చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బండ మనోహర్, గౌడ సంఘం పెద్దలు పెద్ద కుమారగౌడ్, స్వరాజ్‌గౌడ్, ఓం గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

న్యాయవాదులకు హెల్త్ కార్డులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు హెల్త్ కార్డులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యురాలు పరిపూర్ణ రెడ్డితో కలిసి మంగళవారం అందజేశారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్ నిర్వహించిన కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొన్పల్ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ.. ప్రతి న్యాయవాదికి ఆరోగ్యపరంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఆరోగ్య కార్డులు చాలా ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి సంవత్సరం కార్డులను రెన్యూవల్ చేసి ఇస్తామని చెప్పారు. న్యాయవాదులకు ఆర్థిక ధీమాను కలిగిస్తాయని జగన్ పేర్కొన్నారు. అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ రాష్ట్ర సభ్యురాలు పరిపూర్ణ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఒకవేళ అనారోగ్యానికి గురైన వారికి రెండు లక్షల రూపాయల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పించడం హెల్త్ కార్డుల పంపిణీలో ఉన్న ముఖ్యమైన ప్రయోజనమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, ఎ.దీపక్, అయ్యూబ్, చెలిమెల రాజేశ్వర్, కుమార్ దాస్, సాయిరెడ్డి, మధుసూదన్‌రావు, కుంట శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.ఎల్.శాస్త్రి, కవిత గంగోనే, ఇందుమతి, రజిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

యూనియన్ బ్యాంక్‌లో భారీ స్కాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంగా భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. అయితే యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని తెలిసింది. ప్రైవేటు వ్యక్తుల పేరిట రూ.కోట్లల్లో స్కాం చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు గుర్తించిన లెక్కల ప్రకారం రూ.5 కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. శివాజీనగర్ బ్యాంకులో పనిచేస్తున్న సదరు అధికారి పలువురు వ్యక్తుల పేరిట వివిధ రకాల రుణాలు తీశాడు. అయితే వాటిని లబ్దిదారుల ఖాతాకు కాకుండా నేరుగా తన ఖాతాలకు మళ్లించాడు. ఆ తర్వాత పలువురికి ఈఎంఐ చెల్లించాలని బ్యాంకు నుంచి వారి ఫోన్లకు సందేశాలు వెళ్లాయి. దీంతో పాటు మరి కొందరు డిఫాల్టర్ అయ్యారు. బాధితులు బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా స్కాం జరిగిన విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై అప్రమత్తమైన యూనియన్ బ్యాంక్ అధికారులు అంతర్గత విచారణ చేపట్టారు. బాధితులను పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం స్కాంకు పాల్పడిన సదరు అధికారి అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకు అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. సంబంధిత రెండవ పోలీస్ స్టేషన్లో ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలుపుతున్నారు.

ఘనంగా శీతల్ పండగ



శీతల పండగను నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ తాండాలో గిరిజనులు మంగళవారం శీతల పండగను ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దేవతలకు యువతులు, తాండావాసులు ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులు ఆరోగ్యంతో ఉండాలని ఈ పండగను నిర్వహిస్తామని తాండా పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో తండావాసులు భూక్యా తిరుపతి నాయక్, భీమా, బాదావత్ శివ, అంజి, భీముడు, జగన్, వెంకట్, శ్రీనివాస్, రమేష్, శ్రీధర్, శివ, నందు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్ తాండలో సీతలా పండుగ

జక్రాన్‌పల్లి : మండలంలోని వివేక్‌నగర్ తండాలో సీతలా పండుగను నిర్వహించినట్లు మండల మాజీ ఉపాధ్యక్షుడు తెలిపారు. పాడిపంటలు, ప్రజలందరూ బాగుండాలని సీతల పండుగ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తాండవాసులు పాల్గొన్నారు.

వైద్యం కోసం 2లక్షల ఎల్‌ఓసి అందజేత



నవతెలంగాణ-భీంగల్

మండల కేంద్రానికి చెందిన మక్దూం అలీ షేక్‌కు రెండు లక్షల రూపాయల ఎల్ఓసిని కాంగ్రెస్ మండల నాయకులు అందజేశారు. అలీ షేక్ అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ కొరకు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. ఈ విషయమై బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డిని సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఆ మంజూరు పత్రాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు మల్లెల లక్ష్మణ్, శేఖర్, రంజిత్‌లు బాధితుడికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : కాయకాల్ప

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం కాయకల్ప బందం సభ్యులు అమిర్ సింగ్, శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఓపి, ఐపీ రోగుల వైద్య సేవల రిజిస్టర్ వివరాలు నమోదు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో పరిసరాలు పరిశుభ్రత ను చూసి సంతప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్, కాయకల్పం బందం సభ్యులు శ్రీదేవి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండ ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప సభ్యులు

వర్షాలు లేక బోసిపోతున్న చెరువులు

నవతెలంగాణ-సదాశివనగర్

వర్షాలు కురకపోవడంతో నీరు లేక చెరువులు బోసిపోయాయి. మండల కేంద్రంలోని పాత చెరువు నీరు లేక వెలవెలబోతోంది. మిషన్ కాకతీయ పథకాన్ని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ చెరువుతోనే ప్రారంభించారు. ఇక్కడి చెరువుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో నీటితో కళకళ లాడే చెరువు.. ప్రస్తుతం వర్షాలు లేక నీరు లేక బోసిపోయింది.


నీరులేక బోసిపోయిన చెరువు

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

- అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించాలి
- పలుచోట్ల ర్యాలీలు

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం/జుక్కల్

'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' పేరిట ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు ప్రచారం నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ర్యాలీలు చేపట్టారు.

డోంగ్లి మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మాదన్‌ఇప్పర్గా గ్రామంలో గల రెండు సెంటర్ల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు చిన్నారి పిల్లలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు శాంతాబాయి, మంగళ.. కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈనెల 15 నుండి ప్రారంభమైన అంగన్వాడి కేంద్రాల్లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి కష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. చిన్నారి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.


మద్నూర్ : మదన్‌హిప్పర్గలో ర్యాలీ


పిట్లంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పిట్లం : మండల కేంద్రంతో పాటు పిట్లం సెక్టర్ గ్రామాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేణుక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలనే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డబ్బులు ఎందుకు దండగ-చెంతనే అంగన్వాడీ ఉండగా, అంగన్‌వాడీ ముద్దు-ప్రైవేటు వద్దు, అంగన్వాడి బడి-ఆటపాటల సిరి అనే పలు నిదాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ పాఠశాలల్లో విద్యాబోధన నిర్వహించాలనే తలంపుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మ మాట-అంగన్వాడి బాట కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు , ఆయాలు తదితరులు పాల్గొన్నారు.


జుక్కల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో

జుక్కల్ : అమ్మ మాట.. అంగన్‌వాడీ బాటా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని సీడీపీవో సునందా అన్నారు. మంగళవారం మండలంలోని కేమ్రాజ్ కల్లాలీ తాండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅథితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమహోత్సవంలో భాగంగా సెంటర్ ఆవరణలో టీచర్ రాధతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం గిరిజన తండాలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ.. రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ ఆదేశాలనుసారం మండలంలోని యాబై రెండు అంగన్‌వాడీ కేంద్రంలో జూలై 15వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. మూడు సంవత్సరాలు నిండి పైబడిన పిల్లలకు సెంటర్‌లో ఖచ్చితంగా చేర్చాలని తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం, పాఠశాలలో, కాళాశాలలో డ్రాప్ అవుట్ అయిన చెర్పించుకోవడం కోసం గ్రామస్తులకు అవగాహన కల్పించడం చేయాలన్నారు. జూలై 18వ తేదిన రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించాలి. ప్రీ స్కూల్ కార్యక్రమాలు, సెలబస్, టైంటేబుల్, వర్క్ బుక్‌కిట్ మెటీరీయల్, స్కూల్ రెడినెస్ యాక్టివిటిస్ గురించి పిల్లల తల్లిదండ్రులకు తెలియ చేయాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో పిల్లలను నమోదు చేయించాలని సూచించారు. జూలై 19వ తేదిన స్వచ్ఛ అంగన్‌వాడీ, సిద్ధంగా ఉన్న తరగతి గది, సెంటర్ అవరణలో పరిశుభ్రత పాటించాలి, తాగునీరు, మరుగుదొడ్లు ఉపయోగంలోకి తీసువాలని, పిల్లలకు స్నేహ పూర్వక వాతావరణం కల్పించలని సూచించారు. కార్యక్రమంలో సిడీపీవో సునందా, కేమ్రాజ్ కల్లాలీ తాండా అంగన్ వాడీ టీచర్ రాదా, గ్రామ మహిళలు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని పలు గ్రామాలలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణం డీలర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారి బిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వెలగనూర్, బంజాపల్లి, జక్కాపూర్ గ్రామాలలో రేషన్ పంపిణీ డీలర్ ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల సభ్యులు దరఖాస్తులకు 18 జూలై నుండి 31 జులై వరకు రెవేన్యూ డివిజనల్ అధికారి గారి కార్యాలయం బాన్సువాడ నందు రూ 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని. ఎంపిక విధానం రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వారా ఉంటుందని తెలిపారు. కనీస విద్యా అర్హత పదవ తరగతి పాసై ఉండాలని ఆయన తెలిపారు. రాత పరీక్ష 9 ఆగస్టు 11 గంటల నుండి 1 గంటల వరకు ఎస్ఆర్ఎన్కె ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ నందు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు మండల రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్



ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసుల బాల్‌రాజ్‌ను మంగళ వారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బస్వంత్ రావ్‌పటేల్, మారుతీ, మోహన్‌రెడ్డి, వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాద్యాయులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఉపాద్యాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ఉపాద్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వర్షాకాలం వ్యాధుల కాలమని, వాటి భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మండలా ఆరోగ్య అధికారి డాక్టర్ శరత్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని వాహకాల ద్వారా ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, జపనీ సెన్సఫాలిటీస్ వంటి వ్యాధులు వర్షాకాలంలో ప్రబలుతాయని, అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సీజన్లో ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, ఎప్పటికప్పుడు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. విటమిన్లు, పిండి పదార్థాలు, మాంస కతులు, ఖనిజ పదార్థాలు కలిసినటువంటి బ్యాలెన్స్ డైట్ భోజనం తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్,సిబ్బందితో పాటు ఆరోగ్యశాఖ బోధకులు దస్తీరం, సూపర్వైజర్ రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్త సరిత, ఆశా వర్కర్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేత


హాకీ స్టిక్‌లు అందజేస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

హాకీ పోటీలకు అర్హత సాధించిన అక్కడికి వెళ్లి ఆడేందుకు క్రీడాకారులకు వ్యాపారవేత్త బీబీపేట్ మండలం జనగామ గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి రూ.40 వేల విలువగల క్రీడా సామాగ్రిని మంగళవారం అందజేశారు. కేరళ రాష్ట్రంలోని కొల్లంలో ఈనెల 19 నుండి 26 వరకు నిర్వహించనున్న ఇండియ సౌత్ జోన్ హాకీ చాంపియన్ షిప్ 2024 పోటీలకు కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామం నుండి నలుగురు క్రీడాకారులు ఎంపిక అయ్యారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున గర్గుల్ గ్రామం నుండి బాలుర విభాగంలో దినేష్, తులసి కుమార్, బాలికల విభాగంలో వీణ, భవాని ఎంపికయ్యారు. వారికి సరియైన క్రీడ పరికరాలు లేనందున గర్గుల్ గ్రామనికి చెందిన మన ఊరు ఫౌండేషన్ టిం తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డిని సంప్రదించగా ఆయన భార్య రజినితో కలిసి 40,000 రూపాయల విలువ గల క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగంలో రాణిస్తే అందుకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

లారీని ఢీ కొట్టిన కారు

- ఒకరు మృతి


లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు


క్షతగాత్రులు ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-భిక్కనూర్

ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఒకరు మరణించిన ఘటన మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ పట్టణానికి చెందిన శివకుమార్ (34) అతని భార్య రవళి, ఇద్దరు పిల్లలు, స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుండి నిర్మల్‌కు బయలుదేరారు. సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపం వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ ఎలాంటి ఇండికేటర్, ప్రమాద సూచికలు లేకుండా నిలపడం వలన కారు వెనక నుండి లారీని ఢీకొనగా కారు నడిపిస్తున్న శివకుమార్ అక్కడికక్కడే మరణించాడు. గాయాలైన మిగతా వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

జలశక్తి అభియాన్‌పై కలెక్టరేట్‌లో ప్రజంటేషన్


పవర్‌పాయింట్ ప్రజంటేషన్ పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు వివిధ శాఖల ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతల, పర్క్యులేషన్ ట్యాంకుల, చెక్ డ్యాములు, కంటూర్ కందకాల నిర్మాణం పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నోడల్ అధికారులు పరిశీలించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల శక్తి అభియాన్, వర్షపు నీటిని ఒడిసి పట్టు 2024 జలశక్తి కార్యక్రమం కింద చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిఎఫ్ఓ నిఖిత కేంద్ర అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డిఆర్డిఓ బి. చందర్, జిల్లా భూగర్భ జలాల అధికారి సతీష్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు సెంట్రల్ నోడల్ అధికారులను నియమించారు.

డిప్యూటీ సెక్రటరీ బెంజిమెన్ కర్ణాకర్ ను మినిస్ట్రీ ఆఫ్ పవర్ నోడల్ అధికారిగా నియమించారు. వీరితో పాటు కేంద్ర భూగర్భ నీటి శాఖ సీనియర్ శాస్త్రవేత్త అథర్వ కష్ణ పవర్ తో కలిసి జిల్లాలో ఈనెల 15 నుంచి 18 వరకు జల శక్తి అభియాన్ కార్యక్రమంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- వనమహోత్సవంలో అధికారులు
- పలుచోట్ల ఇంటింటికి ఐదు చొప్పున మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్/లింగంపేట్/నిజాంసాగర్

ప్రతి ఇంటికి ఐదు మొక్కలు నాటి వాటిని రక్షించాలని జీపి సెక్రెటరీ సందీప్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని జీపి సెక్రెటరీ సందీప్‌కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ విట్టల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత ఇంటి యజమానులేదేనని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటడం వాటి సంరక్షించడం మన అందరి బాధ్యతగా జీపి సెక్రెటరీ గ్రామ ప్రజలను కోరారు.


లింగంపేట్ : నల్లమడుగులో మొక్కలు నాటుతున్న డీఈవో రాజు..


మద్నూర్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ

గ్రామపంచాయతీ పరిధిలోని వైయస్సార్ కాలనీ ఇందిరానగర్ కాలనీలో మొక్కలు పంపిణీ చేశారు.

పలు గ్రామాల్లో వన మహోత్సవం

లింగంపేట్ : లింగంపేట్ మండలంలో ఆయా గ్రామాలలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో లు మొక్కలు నాటారు. మండలంలోని నల్లమడుగు శెట్టిపల్లి శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి రాజు మొక్కలు నాటారు. అదేవిధంగా శెట్టిపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామాలలో ఎంపీడీవో నరేష్ మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని నాగన్న గారి బాయిలో ఉపాధి కూలీలతో మట్టిని తీయించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి రాజు మాట్లాడుతూ మొక్కలు నాటితే సరిపోదని, వాటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. నాటిన మొక్కలు పెరిగితే వర్షాలు సమద్ధిగా కురుస్తాయని పాడిపంటలు బాగా పండుతాయి అన్నారు. ఈ కార్యక్రమం కార్యదర్శుల క్షేత్ర సహాయకులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


నిజాంసాగర్‌లో..

ఇంటింటికి మొక్కల పంపిణీ

నిజాంసాగర్ : మండలంలోని మల్లూరు గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలందరికీ ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి సంతోష్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను అందరు పెంచాలని ఆయన ప్రజలకు సూచించారు. దోమలు పెరగకుండా నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయన ఆయిల్ బాల్స్‌లను పిచికారి చేయించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

దాబాలో ఎక్సైజ్ తనిఖీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలో ఉన్న దాబా హెూటల్ పై ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాబా హెూటలలో మద్యం సిట్టింగులు నిర్వహించరాదని, అక్రమంగా ఇతర రాష్ట్రాల నుండి మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే స్థానిక టోల్ ప్లాజా వద్ద అక్రమ మద్యం రవాణా కాకుండా వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సీఐ మధుసూదన్ రావు, ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్ సిబ్బంది బాలరాజు, శ్రీనివాస్, పావని, అపూర్వ, తదితరులు పాల్గొన్నారు.


దాబా హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కల్తీకల్లు విక్రయించిన పట్టించుకోరా...?

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో కల్తీ కల్లు విక్రయించిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, లక్ష్మణ్, రవి, బాలరాజు అధికారులను ప్రశ్నించారు. కల్లు దుకాణాలపై నామమాత్రంగా దాడులు చేసి వెళ్లిపోతున్నారని, పూర్తిస్థాయిలో కల్తీకల్లును అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విఫలం చెందారని విమర్శించారు. కల్తీకల్లును అరికట్టకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని తెలిపారు.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీ యోదిన్ కలిసి సన్మానించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతల తీసుకున్నందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-మద్నూర్



మద్నూర్ మండల కేంద్రంలోని సోనార్ స్వామి ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండగా తాళం పగుల గొట్టి చోరీ చేశారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ సాయన్న మంగళవారం ఇంటిని పరిశీలించారు. 12 తులాల వెండి నాణెములు, ఒక గ్రాము బంగారు విగ్రహం, రూ.12 వేల నగదు ఎత్తుకెళ్లినట్టు కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నవోదయలో వైద్య సేవలు

నవతెలంగాణ-నిజాంసాగర్



నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి విజ్ఞప్తి మేరకు ప్రతిరోజు మధ్యాహ్నం గంట సేపు నవోదయ పాఠశా లలోనే వైద్య సేవలను విద్యాన భ్యసించే పిల్లలకు అందిస్తున్నా మని మండల వైద్యాధికారి రోహిత్ మంగళవారం తెలిపారు. జ్వరం వచ్చిన పిల్లలను హాస్పిటల్‌కు తీసుకువస్తే కొందరు చిన్న పిల్లలు భయపడు తున్నారని పాఠశాలలోనే ఇంటి వాతావరణం ఉంటుందని అందువలన పిల్లలకు వైద్యం పాఠశాలలోనే అందించాలని ప్రతిరోజు మధ్యాహ్నం గంట సేపు నవోదయ పాఠశాలలోనే పిల్లలకు వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్‌నర్స్ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనులను తనిఖీ చేసిన ఆర్డీఓ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మంగళవారం మండల ప్రత్యేక అధికారి, ఆర్.డి. ఒ.మన్నె ప్రభాకర్ తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న మరమ్మతులను విద్యార్థుల సౌకర్యార్థం త్వరిత గతిన పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని తనవంతుగా మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ ప్రకాష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఆర్డీవో

వృద్ధాశ్రమానికి దుప్పట్ల వితరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో మద్దికుంట లో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర ఆలయంలోని వద్ధాశ్రమంలో నివసిస్తున్న 45 మంది వద్ధులకు మంగళవారం ఇన్స్ ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు శివాజీ రావు, సంతోష్, విట్టల్ రావు, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు దుప్పట్లు అందజేత

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

4

నిజామాబాద్

బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాయిల్స్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాయిల్స్‌ని చోరి చేరిన దృశ్యం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొల్లూరు గ్రామశివారులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 40 కే.వి, 16కె.వి. ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్, కాయిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్ విద్యార్థికి నాట్యకిరణం అవార్డు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విజయ్ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ వారి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం, తెలంగాణ బోనాల ఉత్సవాన్ని రవీంద్రభారతి వేదికగా ఆదివారం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి నృత్య కళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొనగా కూచిపూడి నృత్యంలో 7వ తరగతి చదువుతున్న వి.అద్వైతరెడ్డి పాల్గొని 'నాట్యకిరణం' అవార్డును, మెమోంటోను అందుకున్నారు. ఈ సందర్భంగా 'నాట్యకిరణం' అవార్డును అందుకున్న వి.అద్వైత రెడ్డిని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత అభినందించారు.

తానకుర్దులో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానకుర్దు గ్రామంలో మంగళవారం మెడికవర్ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టరు మహిత, కో ఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

లక్కోరా వద్ద ఆవులను పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

గోరక్షక దళల సమాచారం మేరకు వేల్పూర్ మండలంలోని లక్కోరా గ్రామ జాతీయ రహదారి రైస్‌మిల్ వద్ద 13 ఆవులను రూరల్ సిఐ కె.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని గోవింద్‌పేట గ్రామానికి చెందిన రాజశేఖర్ ఆవులను తరలిస్తున్నట్టు తెలిసిన సమాచారం మేరకు ఆవులను పట్టుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నుంచి రూ.65,000 మాయం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బ్యాంకు ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే ఖాతా నుంచి రూ.65 వేలు మాయమైన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న రత్నాకర్ ఖాతాలో నుంచి సుమారు రూ.65వేలు విత్ డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి తన ఫోన్‌కు పదేపదే ఓటీపీలు వస్తున్నాయని తెలిపారు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ షేర్ చేయలేదని అంతే కాకుండా ఎలాంటి లింకు ఓపెన్ చేయలేదని తెలిపారు. కానీ తన ఖాతా నుంచి డబ్బులు పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై న్యాయం చేయాలని శివాజీనగర్ బ్రాంచ్‌లో గల యూనియన్ బ్యాంకును ఆశ్రయించగా బాధితుడి ఖాతా బ్యాంకు లావాదేవీలకు సంబంధించి స్టేట్ మెంట్‌ను పరిశీలించారు. ఈ విషయమై సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించాలని బ్యాంకు ఉద్యోగులు బాధితుడికి సూచించినట్లు తెలిపారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో న్యాయం చేయాలని ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

అవినీతి లేని అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తాం

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



రిబ్బన్ కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

అవినీతి లేని అభివృద్దే ధ్యేయంగా తాము ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నూతన ప్రవేశ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

మున్సిపల్ పరిధిలోని పిప్రి రోడ్డు వద్ద మంగళవారం "వనమహోత్సవం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్ పర్సన్ లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జీపి కార్మికుల బకాయిలు విడుదల చేయడం పట్ల హర్షం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దాసు



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దాసు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జీపీ ఉద్యోగ కార్మికుల పెండింగ్ బకాయిలను విడుదల చేయడాన్ని హర్షిస్తున్నట్టుగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు దాసు తెలిపారు. మంగళవారం నగరంలోని ద్వారకానగర్‌లో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. సఫాయి కార్మికులు ప్రజారోగ్యం కోసం తపించి పనిచేస్తున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం గమనంలో పెట్టుకుని, ప్రతినెల సకాలంలో వేతనాలు అందించాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉన్న జీపి కార్మికులందరినీ యుద్ధ ప్రాతిపదికన క్రమబద్దీకరించాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కెసిఆర్ ప్రభుత్వం జీపి కార్మికుల సమ్మెను నిర్లక్ష్యం చేసిందని, సమ్మె సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పంచాయతీ కార్మికులకు సంపూర్ణ మద్దతు పలికి అధికారం చేపట్టగానే సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చారని ఆయన తెలిపారు. జీపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న జీపి కార్మికుల సమస్యలను విశాల దృక్పథంతో పరిష్కరించాలని దాసు రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనత గంగాధర్, నాయకులు యస్.సుధాకర్, దాల్మలకి పోశెట్టి, ఐఎఫ్‌టీయూ నాయకులు శివకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పండుగ సీత్ల

- ఆషాఢ మాసంలో ఘనంగా 'సీత్లా యాడీ పండుగ' నిర్వహణ
- తండా పెద్ద మనేషే పూజారి



సీత్ల పండుగలో పాల్గొన్న లంబాడీ గిరిజన మహిళలు, చిన్నారులు

నవతెలంగాణ-మాక్లూర్

ప్రకృతిని పూజించే పండుగ సీత్ల యాడీ లంబాడీ గిరిజన ప్రజల దేవత. పశ సంపద కోసం, పశువుల ఆరోగ్యం కోసం, తండా సౌభాగ్యం కోసం సీత్ల భవానీ యాడీ పూజ చేయడం లంబాడీల ఆనవాయితీ. కలరా, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, కరోనా వంటి మహమ్మారులు వ్యాధులు ప్రబలకుండా కాపాడుతుందని బంజారాల నమ్మకం. తండాలో ఏ కార్యం జరిగినా.. పెళ్ళి, పుట్టుకలు, చావులు, పండుగలు అయినా సామూహికంగా తండా పెద్దలే ఘనంగా జరిపిస్తారు. పెళ్ళి అయితే ఆ తండాలో ఉన్న ప్రతి ఒక్కరూ కలిసిపోతారు. ఇంటిల్లిపాదీ కలిసి భోజనం చేస్తారు. ప్రతి మనిషి తంతులో పాల్గొనాల్సిందే. ఆట, పాటలతో లంబాడీలు తరతరాలుగా 1.సీత్లా యాడీ, 2.మేరమ యాడీ, 3.తల్జా యాడీ, 4.మంత్రల్ యాడీ, 5.హింగ్ల యాడీ, 6.ధ్వాళ్ ఆంగళ్ యాడీ, 7.కంకాళీ యాడీ ఏడుగురు దేవతలను కొలుస్తారు. తండాలో ఉన్న పశువులు, గొర్లు, మేకలు, కోళ్లు, పశు సంపద పెరగాలని, దూడలకు పాలు సరిపోను ఉండాలని, గడ్డి బాగా దొరకాలని, క్రూర మృగాల బారిన పడకుండా ఉండాలని, అటవీ సంపద తరగకూడదని, సీత్ల తల్లికి మొక్కులు తీర్చుకుంటారు. సీత్ల యాడీ పండుగ ప్రపంచం మొత్తంలో నివసిస్తున్న లంబాడీలు వారి సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహిస్తారు. ఇటువంటి ప్రకృతిని పూజించే పండుగ తెలుగు పండుగల్లో లేదు. ఈ పండుగ బంజారా ఔన్నత్యాన్ని చాటుతుంది. ఈ పండుగ పంటపొలాలు సాగుచేసే సమయంలో ప్రారంభమవుతుంది. దీనిని ఆషాఢ మాసంలో రెండవ మంగళవారం జరుపుతారు. ఇది ప్రతీ సంవత్సర మంగళవారం నాడే జరపడం ఆనవాయితీ. ఇదే గోర్ లంబాడీల మొదటి పండుగా. బంజారా లంబాడీల పండుగలన్నీ ప్రకృతితో ముడిపడి ప్రకృతిని ఆరాధించేవే. సీత్లా అమ్మ లంబాడీ గిరిజన ప్రజల దేవత. ఈ పండగలో భాగంగా తండాల సరిహద్దుల్లోని పొలిమేర, కూడలి వద్ద సీత్ల భవానీని ప్రతిష్టిస్తారు. పురుషులతా డప్పు వాయిద్యాలు వాయిస్తూ కోళ్ళ, మేకలతో, మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారిని ప్రతిష్ఠించిన ప్రదేశానికి వెళ్తారు. ఈ క్రమంలో అందరూ కలిసి పాటలు పాడుతారు. సీత్ల భవాని దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా గుగ్గిళ్ళ, లాప్సి పాయసం సమర్పిస్తారు.

ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

గిరిజనులు జరుపుకునే సీత్లా భవానీ పండుగ రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి. ఆషాఢ మాసంలో రెండవ మంగళవారం నాడు ఈ పండుగను జరుపుతారు. ఇది ప్రతీ సంవత్సర మంగళవారం నాడే జరపడం ఆనవాయితీ. ఇదే గోర్ లంబాడీల మొదటి పండుగా. బంజారా లంబాడీల పండుగలన్నీ ప్రకృతితో ముడిపడి ఉంటాయి. సీత్లా అమ్మ లంబాడీ గిరిజన దేవత. ప్రభుత్వం సీత్లా పండుగను గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలి.

- కిషన్ నాయక్, కల్లెడ



పూజలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

పోరాటాల ఫలితంగానే నిధులు మంజూరు

- ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రమేష్



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్

నవతెలంగాణ-ధర్పల్లి

పోరాటాల ఫలితంగానే జీపి కార్మికుల బకాయి వేతనాల చెల్లింపుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, పోరాడిన గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు విప్లవాభినందనలు తెలియజేస్తున్నట్టు భారతకార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్మికుల కొరకు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పెండింగ్ జీతాల, సమస్యల పరిష్కారం కోసం గత అనేక నెలలుగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో అనేక సార్లు వివిధ రూపాలలో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. డిపిఓ, జిల్లా కలెక్టర్లు 'నిధులు లేవు. తామేం చేయలేం.' అని చేతులెత్తేయగా మరో దఫా జూలై 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించామని వివరించారు. ఎమ్మెల్యే, మంత్రులకు వినతిపత్రాలు సైతం అందజేశామని పేర్కొన్నారు. చివరికి జులై 11న ఛలో హైదరాబాద్ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యాలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి కదిలివచ్చిన వందలమంది గ్రామపంచాయతీ కార్మికులతో ముట్టడించామని, ఈ ధర్నాలో పాల్గొన్న కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు, కార్మికులు, రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించామన్నారు. ఈ విజయం కార్మికులందరిదని ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్, పిడిఎస్‌యు ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆశిష్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టియు ధర్పల్లి మండల కమిటీ అధ్యక్షులు ఆశన్న, ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు సాయినాథ్, సులోచన, సాయవ్వ, శారదా, విలాష్, సంతోష్, రజిత తదితరులు పాల్గొన్నారు.

సర్వేనెంబర్ 340 ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు

- తహసీల్దార్ శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

సర్వేనెంబర్ 340 ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ముందు భాగంలో ఉన్న 340 సర్వే నెంబర్ భూమిని కబ్జాచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మంగళవారం ఆ భూమిలో ఆయన హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. మొత్తం 340 సర్వే సర్వే నంబర్‌లో ఒక ఎకరం 30 గుంటలు కోర్టు పరిధిలో ఉన్నందున, మిగతా రెండు ఎకరాల భూమిలో ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే వారిపై చట్టం చర్యలు తప్పవని ఆయన హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ నాయకులకు రాజకీయంలో ప్రాధాన్యత కల్పించాలి

- ఎడపల్లి ముదిరాజ్ సంఘం నాయకుల డిమాండ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

ముదిరాజ్ నాయకులకు రాజకీయంలో ప్రాధాన్యత కల్పించాలని ఎడపల్లి ముదిరాజ్ సంఘం నాయకుల డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ దాన్వాల్ సింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ముదిరాజ్ అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చేస్తూ ప్రకటించాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 100 కోట్లు నిధులు మంజూరు చేయించాల్సిందిగా నాయకులకు విజ్ఞప్తి చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 22/11/1914 రిక్రూట్‌మెంట్ జీవో ఎంఎస్ నెంబర్ నాలుగు, జీవో ఎంఎస్ నెంబర్ 74, జీవోఎంఎస్ నెంబర్ 4, జీవో ఎంఎస్ నెంబర్ 6 జీవోల ప్రకారం చెరువు కుంటల సంపదపై, మత్స్య సంపదపై, తెనుగు, ముదిరాజ్, బెస్త, గంగపుత్ర అలాగే గంగపుత్ర కులాలకు మాత్రమే అ హామీలు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మత్స్య కార్మికుల అభివృద్ధికి రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేసి 75 శాతం సబ్సిడీలో సంక్షేమ పథకాలు చేపడుతున్నారన్నారు. అలాగే తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేసి తగిన నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణమ మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు జరిపి చైర్మన్‌తో పాటు పాలకవర్గాన్ని నియమించాలని వారు కోరారు. 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు, గౌడ కులస్తులకు ఇస్తున్న మాదిరిగానే ముదిరాజ్ మత్స్య కార్మికులకు కూడా పింఛన్ సౌకర్యం కల్పించాలని వారు పేర్కొన్నారు. రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని వారు కోరారు.

10శాతం కార్పొరేషన్ పదవులకు ముదిరాజ్‌లను చైర్మన్‌గా నియమించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు టి.కృష్ణ, ఎడపల్లి మండలాధ్యక్షులు సున్నపుడేన్న, కార్యదర్శి యాసాడ రాజకుమార్, గండ మనోజ్, నెల్లి రాజు, అశోక్, గుండారం సాయిలు, పెసర ఆంజనేయులు మంగళ్‌పాడ్ మాజీ ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, పొన్నాల రాజు, కొండ సాయన్న, భారత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

- రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రముఖ విశ్లేషకులు రామ్మోహన్ రావు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వం హామీలను అమలు చేయాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు రామ్మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని మీలాద్ ఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రామ్మోహన్‌రావుతో పాటు, సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలని సవరిస్తుందని పేదలపై భారాలు వేయటమే పనిగా పెట్టుకుందని అన్నారు. ఫోన్ బ్యాలెన్స్ రూ.50 కి పెంచడం అందులో భాగమేనని తెలిపారు. అదే మాదిరిగా నిత్యావసర వస్తువుల ధరలన్నీ రోజురోజుకూ పెరుగుతున్నాయని, కార్మికుల శ్రమకు తగిన ఫలితం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తుందని, ఇచ్చిన ఆరు హామీలలో రెండు మాత్రమే అమలవుతున్నాయని తెలిపారు. మహిళలకు బస్సు ఫ్రీ, ఉచిత విద్యుత్ అందరికీ అమలు కావడం లేదని అన్నారు. అనేకమంది పేదలకు బిల్లులు వస్తున్నాయని చెప్పారు. వెంటనే సరిచేసి అర్హులైన పేదలకు ఫ్రీ విద్యుత్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మిగతా నాలుగు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి నిర్మించి వదిలేసిందని, వాటి నిర్మాణం వెంటనే పూర్తిచేసి నిరుపేదలందరికీ పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని, ప్రతి ఒక్కరికీ ఐదు లక్షలు రుణం సైతం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యం చేసి సమరశీల పోరాటాలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఈ.భూమన్న, సదమస్తుల అశోక్, గణేశ్, ఓంకార్, లాగా నాయక్, గంగామణి, కుల్దీప్‌శర్మ, సాయిలు, కిషన్, సయుధా బేగం, రసీదా బేగం, కలీం తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న వారికి సన్మానం



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామంలోని గ్రామీణ బ్యాంకులో పనిచేసిన బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌ను గ్రామ కమిటీ అధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. వారితో పాటు నూతనంగా వచ్చిన మేనేజర్‌కు స్వాగతం పలుకుతూ బదిలీపై వెళ్తున్న వారిని సైతం సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట చిన్నయ్య, పంచాయతీ సెక్రెటరీ రానా, కాంగ్రెస్ నాయకులు సుర భూమేష్, జితేందర్, నజీర్, రాఘవేందర్, భూమన్న, రాజలింగం, గంగాచారి, సతీష్, ప్రసాద్, చిన్నరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్‌టైం ఛాన్స్ (సిబిసిఎస్) బి.ఎ./బీ.కాం./ బీ.ఎస్సీ./బిబిఏ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో జరిగిన పరీక్షకు ఉదయం 19 మంది విద్యార్థులకు 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 107 మంది విద్యార్థులకు గానూ 99 మంది విద్యార్థులు హాజరయ్యారని, 08 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలియజేశారు.

శభాష్ పోలీస్

- మహిళను కాపాడిన ఎస్ఐలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళను ఎస్ఐలు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి.. డిచ్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఆర్థిక ఇబ్బందుల మూలంగా మంగళవారం ఇంటి నుంచి వెళ్ళింది. తిరిగి రాలేదు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే డిచ్‌పల్లి ఎస్ఐ మహేష్‌కు సమాచారం అందించారు. ఫోన్ రింగ్ అవుతున్నా.. ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేయకపోవడంతో మొబైల్ ట్రాకింగ్ ద్వారా గుర్తించగా.. నిర్మల్ జిల్లా బాసర వంతెన వద్ద ఉన్నట్లు ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా గుర్తించారు. వెంటనే డిచ్‌పల్లి ఎస్ఐ మహేష్ బాసరలో పనిచేస్తున్న ఎస్ఐ కచ్చకాయల గణేష్‌కు సమాచారం అందించగా వెంటనే వెళ్లి మహిళను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఒక మహిళ ఆర్థిక ఇబ్బందులతో విసుగుచెంది ఆత్మహత్యాయత్నం చేసిన సమయంలో ఆమె ప్రాణాలు రక్షించిన పోలీసులను పలువురు 'శభాష్ పోలీస్' అంటూ అభినందిస్తున్నారు.

ఏడాది కిందే నిర్మాణం.. ఊరుస్తున్న భవనం



- నాణ్యతకు పాతర వేసిన కాంట్రాక్టర్
- వర్ని ఎస్సీ బాలుర వసతి గృహ దుస్థితి
- విద్యార్థులకు ఇబ్బందులు

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయం పక్కనే గతేడాది కింద నిర్మించిన ఎస్సీ బాలుర వసతి గృహం చిన్నపాటి వర్షాలకే ఊరుస్తోంది. దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రూ. కోటి ఎస్‌డీఎఫ్ నిధులతో గత ఏడాదిలో వర్ని మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

కొద్దిపాటి వర్షానికే ఊరుస్తోంది..

సోమవారం కురిసిన వర్షానికి వసతి గృహం గదులలో, మెట్ల వద్ద ఊరుస్తోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. చదువు కోవాలంటే దోమలు, నిద్ర పోవాలంటే గదులు నీరు తేమతో చల్లగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తోంది.

నిర్మాణంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..

విద్యార్థులు ఏండ్ల కొద్దీ వసతి గృహంలో ఉంటారు. వారికి మంచి నాణ్యతతో కూడిన గదులు నిర్మించాల్సిన కాంట్రాక్టర్లు కక్కుర్తి పడి నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం


పెచ్చులూడిన దృశ్యం


ఊరుస్తోన్న గోడ

చేపట్టడంతో నిర్మించి ఏడాది పూర్తికాకుండానే వర్షానికి ఊరుస్తోంది. రూ.కోటి నిధులతో వసతి గృహం నిర్మిస్తే వర్షానికి ఊరవడంతో నిధులన్నీ బుదిదలో పోసిన పన్నీరయ్యాయి. నిర్మాణం సమయంలో అధికారులు పట్టించుకోలేదనేది స్పష్టమవుతోంది.

పక్కనే ప్రభుత్వాధికారులున్నా పట్టించుకోరు..

ఈ వసతి గృహానికి చుట్టూపక్కన ప్రభుత్వ కార్యాలయాలున్నా.. ఏనాడూ ఆ అధికారులు ఈ వసతి గృహాన్ని పరిశీలించిన రోజులు లేవని విద్యార్థుల చెబుతున్నారు. తమకు వర్షం నీటితో, తేమతో ఏదైనా ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే లేరని విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికే చల్లగా గదులుండటంతో జలుబు, విషజ్వరం లాంటివి వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సార్లు మా హాస్టల్‌ను చూడండి..

ప్రభుత్వ అధికారులు తమ హాస్టల్‌ను పరిశీలించి తమ దుస్థితి చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. వసతిగృహానికి మరమ్మతులు చేపట్టేలా చూడాలని అంటున్నారు. నిర్లక్ష్యం భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

చైల్డ్ హెల్ప్ లైన్, సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన


అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామంలోని ఇటుకల బట్టి వద్దగల గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు అంగన్వాడీ సూపర్వైజర్ వెంకట రమణమ్మ మంగళవారం తెలిపారు. అంగన్వాడీ టీచర్స్ యాక్సెస్ టూ జస్టిస్ ఫర్ అల్ ప్రాజెక్ట్‌లో భాగంగా కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాధన సంస్థ టౌన్ కోఆర్డినేటర్ అక్కడికి వెళ్లి బాలింతలకు, పిల్లలకు భోజనం, పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు, తల్లిదండ్రులకు బాల్యవివాహాల గురించి, బాలకార్మికుల గురించి, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్వైజర్ భిక్షంగు, ముజాహిద్, ఎన్జీవో ఆర్గనైజర్ సంగీత, అంగన్వాడీ టీచర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సంచార పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

సంచార పశువైద్యశాల (1962)వాహనాన్ని రవికుమార్ తనిఖీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందులను, పరికరాలను పరిశీలించి తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. రైతులకు సేవచేయాలని, అలాగే సకాలంలో వైద్యం అందించి మూగజీవాలను కాపాడాలన్నారు. 1962 సేవల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, సంచార పశువైద్య సిబ్బంది కాంతయ్య, పారవేట్ అరుణ్ కుమార్, పైలట్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

నవతెలంగాణ-ఆర్మూర్

పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూర్ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై సిపి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎస్సై అంజమ్మ మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకాటరాయుళ్ల వద్ద నుంచి 6మొబైల్ ఫోన్స్, రూ.19,390 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

నవతెలంగాణ-మద్నూర్

బాన్సువాడ డివిజనల్ పరిధిలోని ఆయా మండలాల్లో గల డీలర్ పోస్టుల ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ అయింది. జుక్కల్ నియోజకవర్గం లోని మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో ఆరు డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో మద్నూర్ మండల కేంద్రంలో షాప్ నంబర్ 2 షాప్ నంబర్ నాలుగు షాప్ నంబర్ 5 అదేవిధంగా డోంగ్లి మండల కేంద్రంలో ఒకటి మద్నూర్ మండలంలోని షేకాపూర్ లో ఒకటి ఈ విధంగా ఆరు డీలర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. 10 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం కోసం 500 రూపాయలు చెల్లించి బాన్సువాడ ఆర్డిఓ కార్యాలయం నుండి దరఖాస్తు ఫారాలు పొందవలసి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 18 నుండి ఈనెల 31 వరకు బాన్సువాడ ఆర్డిఓ కార్యాలయంలో అందజేయవలసి ఉంటుంది. దరఖాస్తు ఫారాల గడువు అనంతరం ఆగస్టు 9న రాత పరీక్ష బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్కె డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తెలుగులో పరీక్ష ఉంటుంది. పరీక్ష అనంతరం ఆగస్టు 14న ఉదయం 10 గంటలకు బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయి. రాత పరీక్ష రాసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుంది.

పదోన్నతుల్లో అక్రమాలు..

- జిల్లా విద్యాశాఖ లీలలు : డీటీఎఫ్

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలో జూన్ మూడో వారంలో జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులలో వివిధ రకాల అక్రమాలు బయటకు వస్తున్నాయని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా బాధ్యులు పి శాంతన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి అవినీతి అక్రమాలు పగడ్బందీగా చేపట్టినట్టు బయటపడుతున్న అక్రమాలను చూస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పదోన్నతులకు అలట్ జరిగిన పాఠశాలల జాబితాను పాఠశాల డైరెక్టర్ కార్యాలయం నుండి జూన్ 18న ఎక్సెల్ రూపంలో జాబితాలు అన్ని జిల్లాల విద్యాశాఖలకు చేరిన మాదిరిగానే నిజామాబాద్ జిల్లాకు కూడా పై జాబితాలు చేరినవని పేర్కొన్నారు. దాదాపు అన్ని జిల్లాలలో జూన్ 18న పాఠశాల డైరెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన జాబితాలు వచ్చినట్టుగానే జిల్లాలలో ప్రకటించగా అందుకు భిన్నంగా జిల్లా విద్యాశాఖ అధికారి చేతివాటం ప్రదర్శించి సీనియర్లకు అలాట్ అయిన ప్రాధాన్యత గల పాఠశాలలను జూనియర్లకు కేటాయించడం, సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతికి అర్హత ఉన్న ఉపాధ్యాయులను పక్కనపెట్టి వారి తర్వాతి డీఎస్సీ వారికి పదోన్నతి ఇచ్చిన సంఘటనలు కూడా బయట పడుతున్నాయని తెలిపారు. మొదట తక్కువ మంది ఉపాధ్యాయులతో జాబితా వెలువరించి మరో రెండు రోజులకు మరో నాలుగురు, ఐదుగురు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని బేరసారాలకు దిగి రెండు రోజుల అనంతరం మరో జాబితాను విడుదల చేయడం ద్వారా డీఈఓ అవినీతి అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. అయితే పైన పేర్కొన్న అక్రమాలకు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఎంచుకున్న ఏకైక మార్గం స్కానింగ్, ఎడిటింగ్ ప్రక్రియ అని ఎక్సెల్ ఫైలుని ఎడిట్ చేయడం సాధ్యం కాదు, కానీ ఆ ఫైలును ఎడిట్ చేయాలంటే స్కాన్ యాప్ ద్వారా పదోన్నతి జాబితాలను డౌన్లోడ్ చేసుకుని ఎడిట్ చేసే అవకాశం డీఈవో తీసుకోవడం ద్వారా జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించిన మొత్తం 853 మంది పదోన్నతుల జాబితాలు అన్నింటిని క్యాంప్ స్కాన్ ద్వారా ఎడిట్ చేసినవే అనే విషయం ఉపాధ్యాయ సంఘాలు గుర్తించి పాఠశాల డైరెక్టర్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

పోరాటాల ఫలితంగా జీతాల విడుదల

- ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పోరాటాల ఫలితంగా పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి అన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జులై 5 రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా, వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. తిరిగి జులై 11 పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించి


మాట్లాడుతున్న జిల్లా నాయకులు

పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేశామని, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 12వ తేదీలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ధర్నాను విరమించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోని కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్టు ప్రకటించిందన్నారు. యూనియన్ కార్మికుల సమిష్టి కృషి వల్లే ఇది ఫలించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కార్మికుడికి విప్లవ జేజేలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజేందర్, నర్సయ్య, సుమన్, బుచ్చయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పొదుపు సంఘాల సొమ్ము స్వాహా

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొల్లూరు గ్రామంలో సి.ఎస్.సి. (కస్టమర్ కేర్ సెంటర్) నిర్వాహకురాలు సంధ్య తన చేతివాటం చూపించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా పొదుపు సంఘాల సొమ్ము ప్రతీ నెల వారి వారి ఖాతాలలో జమ చేయకుండా.. దాదాపు 45 లక్షల సొమ్మును ఇతర ఖాతాలలోకి మళ్లించినట్టు తెలుస్తోంది. కొత్త రుణాల కొరకు ఐ.కె.పి.కి వెళ్లిన తరువాత తెలిసిందని మహిళలు గ్రామ పంచాయతీ ముందర ఆందోళనకు దిగారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఈతమొక్కలను పరిశీలించిన కేంద్ర బృందం


మొక్కలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలోనీ కొత్త చెరువు కట్టపై ఉన్న ఈతమొక్కలను ఈత ట్యాంక్ బండ్‌ను కేంద్ర బృందం అధికారులు మంగళవారం పరిశీలించారు. మొక్క రకం, పెంపుదలకు ఏ స్కీమ్ ఫండ్ ను ఉపయోగించారని అడిగి తెలుసుకున్నారు. ఈత చెట్లవలన ఉపయెగలను తెలుసుకున్నారు. సైడ్ నేమ్ బోర్డు లను చూశారు. కొత్త చెరువు పూడిక తీతను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ జె.ఎస్.ఎ డిప్యూటీ కార్యదర్శి. సైంటిస్ట్ కామారెడ్డి జిల్లా డి.ఆర్ డి.ఓ ఎపిడి ఫైనాన్స్ మేనేజర్, డి.ఆర్. పి హరి ,సురి ఎంపిడి ఓ సంతోష్ కుమార్, ఏపిఓ మధు టెక్నికల్ అసిస్టెంట్ సంతీష్ , పీల్డ్ అసిస్టెంట్ తదితర పాల్గొన్నారు

ఆటపాటలతో విద్యను అందించాలి

- శిశుసంక్షేమ అధికారిని వాణి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ వాణి తెలిపారు. మంగళవారం నసూరుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే బీర్కూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మ మాట అంగన్ వాడి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి మాట్లాడుతూ చిన్నపిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని, పాఠశాలల్లో చేరేనాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటపాట లతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నూతనంగా అమ్మ మాట..


ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు, అధికారులు

అంగన్‌వాడీ బాట కార్యక్ర మానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలిపారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీలను బలోపే తం చేసేందుకు కేంద్రాలకు రెండున్నరేళ్ల దాటిన చిన్నారులను చేర్పించేందుకు సోమవారం నుంచి ఈనెల20వరకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు ఉచితంగా యూనిఫాం కూడా అందించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఏటీఎం గంగాధర్ ఆరోగ్య సిబ్బంది వెంకటలక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు గౌరీ గంగమణి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

- బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

విద్యార్థి దశలోనే యువత లక్ష్యం ఏర్పరచుకుని దాని లక్ష్య సాధన కోసం కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని కొత్తబాది గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వివరాలను హాజరు పట్టికలను రికార్డులను పరిశీలించారు. పాఠశాల గదిలో వెళ్లి విద్యార్థినిలకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అంటూ పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని విద్యార్థుల సౌకర్యాలు గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలి అన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటికి అనుగుణంగా కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. విద్యార్థినిలు బాగా చదివి సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు.

భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటాలి..

భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ అన్నారు. మండలంలోని కొత్త బాది గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన సందర్భంగా కస్తూరిబా పాఠశాల ప్రాంగణంలో ఆర్డిఓ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పచ్చదనం పెంచేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. పాఠశాలలో నాటిన మొక్కలను ఉపాధ్యాయులు విద్యార్థులు తప్పకుండా వాటిని సంరక్షించ బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులపై ఉందని ఆయన అన్నారు. పాఠశాల టీచర్లు సమయపాలన పాటించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయా లత, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ఆర్డీవో